# నివురుగప్పిన నిప్పు

వాకిట్లో జట్కాబండి ఆగిన చప్పుడైంది.

వంటింట్లో పనిచేసుకుంటున్న తల్లితో ముందు గదిలో ఉండి గారంగా పోట్లాడుతున్న పెద్దబ్బాయి ఒక్కసారిగా మౌనం వహించాడు. అంతవరకు అతని పక్కన కూర్చుని రాగాలు తీస్తున్న చిన్నమ్మాయికూడా గప్‌చిప్ అయిపోయింది.

వంటింట్లో ఒకవైపు పనిచేసుకుంటూ, మరో వైపు చిన్నబ్బాయి ఏడుపు తగ్గించడానికి అవస్థ పడుతున్న సీత, అవతలి గదిలో పిల్లలిద్దరు హఠాత్తుగా ఒకేసారి సద్దు మణగడానికి గల కారణమేమిటో బోధపడక ఆశ్చర్యంతో తొంగిచూసింది.

అంతలోనే వీధిలోంచి పెద్దమ్మాయి పరిగెత్తుకుంటూ వచ్చి "అమ్మా, మరే.,.అమ్మా! మరే... ఎవరో ఒకాయన వచ్చాడే. . . మనింటికేనే!" అని చెప్పేసింది ఆయాసపడుతూ.

అప్పటికే ఆయన ఒక చేత్తో లెదర్ సూట్‌కేసు, మరో చేత్తో ఒక బుట్ట పట్టుకుని లోపలికి వచ్చేశాడు. టెరిలిన్ శ్లాక్, పాంట్ ధరించాడు. కాళ్లకి సాక్సూ, బూట్లూ. కళ్లకి నల్లటి అద్దాలు. గోల్డ్ చెయిన్‌తో ఉన్న రిస్ట్ వాచీ, ఉంగరాలు — వీటన్నిటినీ



"భాయ్! చాలాకాలం మేమూ నీలాగే చాలా విష యాల్లో లోకజ్ఞాన శూన్యుడనై చాలా చాలా అవస్థ అనుభవించాను. దీనికి విరుగు డేమిట్రా అని కొన్నాళ్ళ దీర్ఘదీక్షతో తల పగలగొట్టుకుని మరీ పరిశో ధించాను. చివరికి తేలిన దేమిటనుకున్నావ్? వెరీ సింపుల్! ఈ కాలంలో దేనికైనా మీడియం డబ్బు మాత్రమే. కనక మన శ్రమ అంతా ఆ డబ్బు సంపాదన మీదనే కేంద్రీకరించాలి. ఆ డబ్బుని ఎలాగైనా, ఎంతైనా సంపాదిస్తూండాలి. బస్! దానితో ఇక మిగతావి ఏవైనా సరే తేలిగ్గా సంపాదించుకోవచ్చు. ఏమిటలా కళ్ళార్పకుండా బొమ్మలా చూస్తున్నావ్? నేను చెబుతున్నది బోధపడ్డంలేదా ఇంకా?"

సత్యం అతనికి జవాబు చెప్పకుండా సీతకేసి చూశాడు.

ఆమె మందహాసం చేసింది. సత్యం కూడా చిరునవ్వు నవ్వుతూ మెల్లిగా లేచి నిలబడ్డాడు.

"నీ థీరీ బాగానే ఉందిగాని, కాస్సేపు విశ్రాంతి తీసుకో. నే నొకసారి అలా బయటికి పోయి వస్తాను. అన్నట్టు నీకీ హార్లిక్సు బాటిల్సు ఇచ్చిన షాపెక్కడిదిరా?" అన్నాడతను నవ్వుతూనే.

రామూ ఆ షాపూ, దాని పక్కకొట్టూ మొదలయిన వాటినిగురించి వివరించాక, సత్యం మళ్ళీ వస్తానని బయటికి వెళ్ళిపోయాడు.

సీత చాపవేసి, దానిమీద ఒక ఉతుకుల బొంత పరిచింది. రామూని దానిమీద పడుకుని విశ్రాంతి తీసుకోమంది.

రామూ ఆమె స్థితికి జాలిపడుతూ, ఆ బొంత మీద నడుం వాల్చి బాతాఖానీ ప్రారంభించాడు. "సెలవు రోజున కూడా భోజనమయ్యాక కాస్త నడుం వాల్చి నిద్ర తీసుకోకుండా నీ దెక్కడికి పోయినట్లిప్పుడూ?" అన్నాడు.

"సంఘసేవా సమితి అని ఈమధ్య ఇక్కడో సంస్థ స్థాపించా రన్నయ్యా! అందులో ఈయనో కార్య కర్త. రోజూ తీరిక వేళంతా ఆ సమితి కార్యకలాపాలకే వినియోగిస్తూంటా రీయన. సెలవు రోజున మరీ ఎక్కువగా ఆ సమితి పని చేస్తూంటారు" అన్నది సీత.

"బాగుంది. పెళ్ళయి, పిల్లల్ని కన్నా కూడా ఇంకా వీడి బుద్ధి మారలేదన్నమాట!"

"అదేమి టన్నయ్యా, అలా అంటావు?"

"అది కాదు, సీతా! ఏదో స్టూడెంట్ లైఫ్‌లో ఇష్టమొచ్చినట్లు పిచ్చివేషాలేసుకు తిరిగాడంటే అర్థం ఉంది. కాని, ఇప్పుడు పెళ్ళాం పిల్లల బాగోగులు చూడవలసిన బాధ్యత ఉందా, లేదా?"

"ఉంది. అయితే చాలామందిలా ఆ బాధ్యతతోనే సరిపెట్టుకోకుండా సంఘం మంచిచెడ్డా చూసే బాధ్యత కూడా తనకు వీలైనంత వహిస్తున్నారు. తప్పేముంది?'

"అంటే, వా డిలా తిరగడం నీ కేం కష్టం కలిగిం చడం లేదా?"

"కష్టమా? ఆయన్ని ఏమిచూచి నే నన్నిటికీ తెగించి పెళ్ళాడానో వాటిని ఆయన నా మోజులో పడిగాని, ఈ సంసార జంజాటంలో మునిగిపోయిగాని చంపుకో కుండా ఇలా పెంపొందించుకుంటున్నందుకు లోలోన గర్విస్తూంటాను తెలుసా?"

రామూ సీతని ఒక పిచ్చిదాన్ని చూచినట్టు చూస్తూ ఉండిపోయాడు మారుమాట్లాడకుండా.

## 3

సత్యం తిరిగి ఇల్లు చేరేసరికి రామూ బొంత మీద ప్రయాణ బడలికతో నిద్రపోతున్నాడు. సీత పిల్లల్ని నిద్రపుచ్చుతూ కూర్చుంది. కాసేపు ఆమెతో కబుర్లాడి సత్యం కూడా పడుకున్నాడు.

సాయంకాలమైంది. రామూ అవతల అర్జెంటు పనులున్నాయని, ఆ రాత్రికే వెళ్ళిపోవాలని ప్రయాణ సన్నద్ధుడు కాసాగాడు. సీత త్వరత్వరగా వంట ముగిం చింది. అరింటికే రామూ సత్యాలకు అన్నాలు పెట్టేసింది.

రామూకి సామాన్లంతగా లేవు. నడిచే తేలిగ్గా పోవచ్చు స్టేషనుకి. అయినా "ఒరే! ఒక జట్కాని కేకేసుకొస్తావూ?" అన్నాడు. సత్యం నవ్వుకుంటూ వీథిలోకి వెళ్ళాడు.

రామూ పిల్లలకి తలో అయిదు రూపాయలనోటూ అందించాడు. సీత వద్దని వారించబోయింది. సత్యానికి తెలిస్తే తనని కోప్పడతారంది.

"నన్నయితే కొట్టబోతాడు కూడా. అందుకే వాడు లేకుండా చూచి ఇస్తున్నది. ఉంచమ్మా!" అని బలవంతంమీద ఒప్పించాడు.

కొంతసేపటికి సత్యం జట్కా తెచ్చాడు. రామూ లెదర్ సూట్‌కేసు దానిలో పెట్టుకున్నాడు. సీతకి "బై బై", పిల్లలకి "టా టా" లు చెప్పాడు. "రారా" అని సత్యాన్ని హెచ్చరిస్తూ జట్కాలో కూర్చోబోయాడు.

అంతవరకూ పరధ్యానంగా ఉన్నట్లున్న సత్యం ఉలిక్కిపడ్డట్లు "ఉండరా, ఒన్ మినిట్!" అని సీతకేదో సైగచేశాడు.

సీత లోపలికి వెళ్ళి ఉదయం రామూ బజారుకు వెళ్ళి తెచ్చిన సంచీని, ఆ సామాన్లతో సహా అలాగే తెచ్చి భర్తకి అందించింది.

సత్యం ఆ సంచీని కూడా జట్కాలో పెట్టాడు మెల్లిగా.

అది చూచి తెల్లబోతూ, "ఇదేమిట్రా?" అన్నాడు రాము.

"ఒరే, రామూ! నీ స్నేహవాత్సల్యానికి అభినం దిస్తున్నాను గాని, నీ ఉద్దేశాలనుమాత్రం హర్షించలేక పోతున్నాను. బాధపడకు. లోకాన్ని నువ్వొకకోణంలోనించి చూస్తున్నావు. మేమొక కోణంలోంచి చూస్తున్నాం. అంతే తేడా. డబ్బు అన్నది మనకి కొన్నికొన్ని వ్యవహా రాల్లో ఒక మీడియంగా ఉండాలని మాత్రమే మేము భావిస్తాం. డబ్బుంటే చాలు, ఏదైనా చేయవచ్చునని నీలాంటివాళ్ళు భ్రమిస్తున్నారు. ఒకవేళ మీ ఉద్దేశమే వాస్తవమైతే, ఒకప్పుడు బలం కలవాడిదే బతుకు అయినట్లు ఈనాడు ధనం కలవాడిదే దేశం అవుతుంది . . ."

అవమానంతో ఎర్రబడ్డ ముఖంతో, "ఇప్పు డలా కాక ఇంకెలాగుం దీ దేశం?" అని ఎత్తిపొడిచాడు రాము.

"తాత్కాలికంగా నీ ఉద్దేశమే నిజంలా తోచవచ్చు కాని, సర్వజన శ్రేయోరాజ్యం కావాలని ఆశించే మాబోటివా ళ్లున్నంతవరకూ అది నిజం కాదెప్పటికీ!" అన్నాడు సత్యం నిర్మలంగా నవ్వుతూ.

"అసలు ధరకి ఒక గ్లాక్సోడబ్బాగాని, హార్లిక్సు సీసాగాని, ఇంత పంచదారగాని సంపాదించలేనివాడిని, నీలాంటి వాడివల్ల ఏమవుతుందిరా భాయ్?"

"ఆ నాడు బ్రిటిష్‌వారిని ఈ దేశంనించి పంపేస్తా మని గాంధీజీ ప్రభృతులు అన్నప్పుడుకూడా నీలాంటి

జలుబులను నివారించే మరో, అమోఘమైన శక్తి
అనోలియం
వినోదం పోటీ
రు.1500/- గెలవండి
వెంటనే మీ 'ఎంట్రీ'ని పోస్టు చేయండి
ప్రవేశం ఉచితం
ముగింపు తేదీ 31—5—1969
డీలర్లందరివద్దను ఎంట్రీఫారాలు లభించును.

వాళ్లంతా ఇలాగే — 'రవి అస్తమించని ఆ బ్రిటిష్ ప్రభుత్వాన్ని యీ కొల్లాయిధారులా సాగవంపేది?' అని హేళన చేశారు గుర్తుందా?" అన్నాడు నవ్వుతూనే సత్యం.

"ఆ ఫ్రీడమ్ ఫైట్‌లో ఎంతమంది ఎన్ని కష్ట నష్టాలు పడ్డారో, ఎంతెంత త్యాగాలు చేశారో తెలుసా?" అన్నాడు రాము.

"తెలుసు. ఇప్పు డీ ఆశ్రిత పక్షపాతం, బ్లాక్ మార్కెట్ వగైరా అవినీతులను రూపుమాపి, సర్వజన శ్రేయస్సు సాధించడానికి మేము అవసరమైతే మా ప్రాణాలు సైతం ధారపోయడానికి సిద్ధంగా ఉన్నామని నువ్వెందుకు భావించకూడదు?" అని ఎదురుప్రశ్న వేశాడు సత్యం గంభీరంగా.

రామూ చకితుడై సత్యంకేసి తేరిపార చూస్తుండి పోయాడు.

అంతలోనే ఒక యువకుడు వాళ్ల వద్దకు వచ్చి సత్యానికి నమస్కారంచేసి నిలబడ్డాడు.

"హలో!" అని అతనిని పలకరించి రామూకి "ఈయన దీక్షిత్ అని మా సంఘ సేవా సమితి సభ్యుల్లో ఒకరు" అని పరిచయం చేశాడు సత్యం.

దీక్షిత్ రామూకి నమస్కారం పెట్టి "వీరిని గురించే ననుకుంటా మధ్యాహ్నం మీరొచ్చి చెప్పింది" అన్నాడు సత్యంతో.

"అవును. ఏమైనా పని జరిగిందా?" అడిగాడు సత్యం.

"బ్రహ్మాండంగా. మీరు చెప్పి వెళ్లిన వెంటనే ఆ రెండు షాపులమీదా సి. ఐ. డీ.లకి చెప్పి, దాడి చేయించాం. వాళ్లమీద కొంతకాలంగా బ్లాక్‌మార్కెటీర్లన్న అనుమానం పోలీసులకీ ఉంటున్నదట. తగిన రుజువు దొరక్క వాళ్లమీద ఏ చర్యా తీసుకోలేక పోతున్నారట. మన మాటమీద గొప్ప నమ్మకంతో మెరుపుదాడి చేశారు. బోలెడు బేబీఫుడ్, హార్లిక్సు, చక్కెర నిల్వలేగాక, ఇంకెన్నో కంట్రోలు సామాన్లు కూడా రహస్యంగా దాచినవి పట్టుబడ్డాయి. వాళ్లకు గల లైసెన్సులన్నీ రద్దుచేయిస్తామనీ, తగిన శిక్షలు వేయిస్తామనీ కూడా ఆఫీసర్లు చెప్పారు. ఆ దొరికిన సామాన్లన్నీ కంట్రోలు ధరకి, అవసరమైన వాళ్లకి అమ్మే ఏర్పాట్లుకూడా త్వరగా చేయమని కోరి, జరిగినది మీకు చెప్పిపోదామని ఇలా వచ్చాను" అన్నాడు దీక్షిత్.

వాళ్ల సంభాషణను మూగవాడిలా వింటూ నిలబడి పోయాడు రామూ. జట్కావాడు హెచ్చరించడంతో, మౌనంగానే దానిలోకి జొరబడ్డాడు. సత్యం అతని పక్కనే కూర్చుంటూ, "దీక్షిత్‌గారూ! మీరూ కూర్చోండి. మేము వెళ్లేది మీ ఇంటిమీదుగానే. మిమ్మల్ని మీ ఇంటి దగ్గర దింపేసి పోతాం, ఎక్కండి" అన్నాడు.

దీక్షిత్‌కూడా జట్కా ఎక్కి కూర్చున్నాడు. బండి కదిలింది.

దారిలో సత్యమే మళ్లీ "రామూ! మా అబ్బాయికి గ్లాక్సో, సీతకి హార్లిక్సు, ఇంట్లోకి పంచదార వగైరాలు ఎక్కువ ధరలు పెట్టి కొని తేలేనంత దుస్థితిలో నేను లేను. అలా ఎందుకు కొనాలని పట్టుదల ఒకటే, అలా కొనలేని వారి గతి ఏమిటి అన్న బాధ ఒకటే, అసలలాంటి అవ్యవస్థనే రూపు మాపాలన్న దీక్ష ఒకటే నన్నహర్నిశలు వేధిస్తూంటుంది. అందుకే నాలాంటి మరికొందరితో కలిసి ఇలా నాకు తోచిన శ్రమ పడుతున్నాను. అంతేగాని అన్యథా భావించకు జరిగినదానికి" అన్నాడు మృదువుగా.

అంతవరకూ బొమ్మలా వింటూ కూర్చున్న రామూ చటుక్కున తన పక్కనున్న సంచీని ఎత్తి సత్యం ఒళ్లో పెడుతూ, "సత్యం! నీ వ్యక్తిత్వం నిప్పులాంటిదని మళ్లీ ఒకసారి ఋజువు చేసుకున్నావురా. జరిగినది మరిచిపోయి, ఈ సంచిలో ఉన్న గ్లాక్సో, హార్లిక్సు, పంచదారల్ని వాటి అసలు ధరలకి అవసరమైన వారికి ఇచ్చి, ఆ పైకాన్ని మీ సంఘ సేవా సమితికి నా పేర విరాళంగా జమకట్టించు. మరింత సంతోషిస్తాను" అన్నాడు మెల్లిగా.

"అలా అన్నావు!—ఆనందంగా అంగీకరిస్తున్నాను" అన్నాడు సత్యం. ★



ఆ రేడియో ఆపెయ్యవే బాబూ! సాయంత్రం నిన్ను సినిమాకి తీసుకువెళ్తాలే!

## శిల్పి

శిల్పి ఒకానొక కట్టుకథలో పసిపిల్లవాడి వంటివాడు. అతని ప్రతి కన్నీటి బిందువు ఒక ముత్యమే! కాని, పాపం, ప్రపంచం అతని సవతితల్లి! ఇంకా ఎన్నో ముత్యాలు రాల్చమని మాటిమాటికి చావగొడుతూంటుంది!

—హైన్

## కళాఖండం

ఒక కళాఖండాన్ని గురించి తీర్పు చెప్పేటప్పుడు దాని లోపాల వైపు చూడకు!

—వాషింగ్టన్ ఆల్‌స్టన్

## అధికారం

ఇతరులమీద పెత్తనం చలాయించడంకన్న మానవుని కత్యంత తృప్తికరమయిన దేదీ లేదు.

—ఎడిసన్

## అమెరికా

అదృష్టం పట్టిన దేశం అమెరికా. యూరపు దేశాల పొరబాట్ల వల్లనే అది గొప్పది అవుతూంది.

—నెపోలియన్

## అరాజకం

అరాజకం మానవజాతి అధికారంపై తిరుగుబాటు; నాస్తికత్వం పరమేశ్వరుని అధికారంపై తిరుగుబాటు. ఇవి ఒకే నాణానికి రెండు వైపులు.

## చిత్రకళ

కళ్ళతోనే మనం చిత్రించగలిగితే ఎంత బాగుండును! కళ్ళ ద్వారా, చేతిద్వారా పెన్సిల్‌లోకి వచ్చేటప్పటికి జీవితం ఎంత చెయ్యిజారిపోతుంది!

—లెస్సింగ్